

కాల భైరవ స్వామికి సింధూర పూజలు

రామారెడ్డి, ఏప్రిల్ 16: మండలంలో వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో మంత్రోశ్చరణల మధ్య స్వామికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.5,316ల దండాను స్వామి వారి మెడలో వేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈవో ప్రభురాంచంద్రం గుప్తా, సురేందర్‌గుప్తా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ.. వేగవంతం!



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నారు. దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగా గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. కామారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలోకి రానుంది. ఈ లోక్‌సభ పరిధిలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బంది పని చేయనున్నారు. ఎన్నికల పోలింగ్‌పై మరో 26 రోజుల సమయం ఉండగా అధికారులు పోలింగ్ సజావుగా సాగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పోలీసులు సవాల్‌గా తీసుకుంటున్నారు.

1974 పోలింగ్ కేంద్రాలు.. 7,894 మంది పోలింగ్ సిబ్బంది

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1974 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కామారెడ్డిలో 266 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎల్లారెడ్డిలో 270, జుక్కల్‌లో 255, బాన్సువాడలో 258, జహీరాబాద్‌లో 314, ఆందోల్‌లో 313, నారాయణఖేడ్‌లో 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ప్రొసీడింగ్ అధికారి, సహాయ ప్రొసీడింగ్ అధికారులతో పాటు మరో ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. వీరితో పాటు నాలుగు నియోజకవర్గాలకు కలిపి 199 మైక్రో అబ్జర్వర్‌లను నియమించనున్నారు. ఈ లెక్కన జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1974 పోలింగ్ కేంద్రాలలో 7,894 మంది పోలింగ్ సిబ్బందిని నియమిం చనున్నారు. ఇందులో పీఓలు 1974 మంది, ఏపీవోలు 1974 మంది, ఓపీఓలు 3,948 మంది ఉండనున్నారు.

పోలింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బంది

ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, ఒక అసిస్టెంట్ పీవో మరో ఇద్దరు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ఇలా ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు చొప్పున 7,896 మంది విధులు నిర్వహిస్తారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది అదనంగా ఉంటారు. వీరిలో 20 శాతం మందిని రిజర్వ్‌లో ఉంచుతారు. అవసరాల మేరకు వీరు విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తి చేశారు. అదేవిధంగా ఈవీఎంల పనితీరుపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన సైతం పూర్తి చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టిన తర్వాత ఎక్కడ విధులు కేటాయించాలనేది ఎన్నికల సిబ్బందికి అధికారులు నిర్ణయిస్తారు.

రేపు వెలువడనున్న నోటిఫికేషన్

పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలు కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 16న లోక్‌సభ షెడ్యూల్‌ను ప్రకటించగా ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఆ రోజు నుంచే జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి అభ్యర్థుల నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగనుంది. నోటిఫికేషన్‌కు సంబంధించి సంగారెడ్డి కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా కామారెడ్డి కలెక్టర్ ఉంటారు. నామినేషన్ల ప్రక్రియ సంగారెడ్డి జిల్లాలోనే కొనసాగనుంది.

లోక్‌సభ పరిధిలో 16,32,266 ఓట్లు

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోకి కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,32,266 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 7,97,700లు ఓట్లు ఉండగా, మహిళలవి 8,33,951, థర్డ్ జండర్‌వి 63 ఓట్లు ఉన్నాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,54,444 ఓట్లు ఉండగా పురుషులవి 1,22,264, మహిళలవి 1,32, 014 ఓట్లు, థర్డ్ జండర్ వి 20 ఓట్లు, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,22,698 ఓట్లు ఉండగా పురుషులవి 1,06,387, మహిళలవి 1,15,355 ఓట్లు, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు, జుక్కల్డ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,02,079 ఓట్లు ఉండగా పురుషులవి 99, 118, మహిళలవి 1,02,814 ఓట్లు, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,95,694 ఓట్లు ఉండగా పురుషులవి 93,2 66, మహిళలవి 1,02,415 ఓట్లు, థర్డ్ జండర్‌వి 13 ఓ ట్లు ఉన్నాయి. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,73,071 ఓట్లు ఉండగా పురుషులవి 1,36,574, మహిళలవి 1,36,391 ఓట్లు, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు, ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,49,451 ఓట్లు ఉండగా పురుషులవి 1,22,031, మహిళలవి 1,27,364 ఓట్లు, థర్డ్ జండర్‌వి 8 ఓట్లు, నారాయణఖేడ్ అ సెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,35,678 ఓట్లు ఉం డగా పురుషులవి 1,18,064, మహిళలవి 1,17,498 ఓట్లు, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి.

- ఎంపీ ఎన్నికలకు ఏర్పాట్లు
- రేపు వెలువడనున్న నోటిఫికేషన్.. నామినేషన్‌ల పర్వం షురూ
- జిల్లా వ్యాప్తంగా 5,048 మంది ఎన్నికల సిబ్బంది
- లోక్‌సభ పరిధిలో 1,974 పోలింగ్ కేంద్రాలు
- ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బంది కేటాయింపు
- ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి
- మొత్తం ఓట్లు 16,32,266



రాజకీయ నాయకులతో సమావేశం..



నోడల్ అధికారులతో..

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 16: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటు పడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'శక్తివంతమైన ప్రజాస్వామ్యంలో ఓటరు భాగస్వామ్యం' అనే అంశంపై స్వీప్ అండ్ పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఒక రోజు వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల వ్యవస్థలో వస్తున్న పరిణామాలు విశ్లేషిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియలో యువతను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో భారత ఎన్నికల సంఘం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. దేశ హితం, దేశ సంక్షేమం కోసం సమాజాన్ని చైతన్యం చేయడంలో యువత తమ వంతుపాత్ర పోషించాలన్నారు. ఓటు హక్కు వినియోగంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశం మెరుగైన స్థితిలో ఉండడం, పారదర్శకంగా వీవీ ప్యాడ్ ద్వారా ఓటు వినియోగం తెలుసుకోవడంతో పాటు పకడ్బందీ వ్యవస్థ వల్ల 12 గంటల్లో ఫలితాలు వెల్లడిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రఘునాథరావు, స్వీప్ అధికారి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్లు కిష్టయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులకు చర్యలు చేపట్టాలి

పాఠశాలల్లో మౌలిక వసతులైన విద్యుత్, తాగునీరుతో పాటు చిన్నచిన్న మరమ్మతు వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక చేసిన కామారెడ్డి మండలం గర్గుల్ ఎంపీపీఎస్ పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20లీటర్ల సామర్థ్యం గల రెండు ఆర్‌వోలను ఏర్పాటు చేయాలని, టాయిలెట్ శుభ్రంగా ఉంచాలని, గచ్చు ఊడిపోయిన చిన్నచిన్న మరమ్మతులు, పాఠశాల పునరుద్ధరణ పనులు గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆఫీస్ రూమ్‌లో కారిడర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈవో ఎల్లయ్య, గ్రామ మహిళ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు కేటాయించే అభ్యర్థుల కనుగుణంగా పట్టణంలో 12 పరీక్ష కేంద్రాలను గుర్తించామని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్‌లదేనని, యువత భవిష్యత్తు మీ చేతుల్లో ఉందని, ఎటువంటి చిన్న తప్పిదాలకు అవకాశమివ్వద్దని తెలిపారు. గదులలో సరైన వెలుతురు ఉండేలా చూడాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్సకు ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవో రఘునాథ్‌రావు, డీఈవో రాజు, సహాయ పరీక్షల కమిషనర్ లింగం, జిల్లా ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి షేక్‌సలాం, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

పీహెచ్‌సీలో మందులను అందుబాటులో ఉంచుకోవాలి

సదాశివనగర్: పీహెచ్‌సీలో అత్యవసర సమయంలో ఉపయోగపడే మందులను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం సదాశివనగర్ పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేపట్టారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున వడ దెబ్బ నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తూ అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు.

సాధ్యమైనంత తక్కువ ఖర్చులో పనులు పూర్తి చేయాలి

పాఠశాలల మరమ్మతుల విషయంలో అతి తక్కువ ఖర్చుతో పనులు పూర్తిచేసేలా చూడాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సదాశివనగర్ మండలం తుక్కోజీవాడి ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దడానికి కృతనిశ్చయంతో ఉన్నందున పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులతో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లను.. వేగంగా చేపట్టాలి

- రాష్ట్ర సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్రసింగ్ చౌహాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 16: ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉగ్రవాయి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, రిజిస్టర్లు, తూకాలు, నూతనంగా ప్రవేశపెట్టిన ఐరిస్ విధానం, ట్యాబ్ ఎంట్రీలు పరిశీలించి, అధికారులు, నిర్వాహకులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని తాలు, మట్టి లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203, గ్రేడ్ బీ రకానికి రూ.2183 నిర్ణయించిందని తెలిపారు. దళారులకు ధాన్యం విక్రయించవద్దని తెలిపారు. హార్వెస్టర్ యజమానులు గంటకు పంట పొలం కోయడానికి ఎంత ధర వసూలు చేస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాఘవేంద్ర రైస్‌మిల్లును పరిశీలించి రోజువారి లక్ష్యాల మేరకు మిల్లింగ్ పూర్తి చే యాలని రైస్‌మిల్ యజమానులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికా ర్జున్‌బాబు, ఇన్‌చార్జ్ మేనేజర్ నిత్యానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవేంద్రసింగ్ చౌహాన్

సీతారాముల కల్యాణం చూతాం రారండి

- సీతారామ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- నేడు జిల్లా కేంద్రంలో శ్రీరామసేన ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర

కామారెడ్డి టౌన్/ బీబీపేట/ బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 29: చైత్ర వసంతంలో కమనీయమైనది సీతారాముల కల్యాణ మహోత్సవం. ఇంటింటా, వాడ వాడలా చలువ పందిల్లు పచ్చని మామిడి తోరాణలతో ప్రతీ చోట శ్రీరామస్మరణతో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ కల్యాణంలో చిన్న, పెద్దలు తారతమ్యం లేకుండా అందరూ పాల్గొంటారు. చైత్ర శుద్ధ ప్రతిపాద నుంచి ప్రారంభమై శ్రీరామ నవరాత్రులు కల్యాణం పట్టాభిషేకంతో ముగుస్తాయి. శ్రీరామ నవమి ఉత్సవాలు, సీతారాములు కల్యాణ మహోత్స ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరుగనున్నాయి. శ్రీరామ నవమి ఉత్సవాలకు పట్టణంలోని అన్ని ఆలయాలు ముస్తాబయ్యాయి, కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆవరణలో, రాంమందిర్, శ్రీరాంనగర్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, ఎన్జీవోస్, వివేకానంద కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీల్లోని ఆయా సీతారామాంజనేయస్వామి ఆలయాలు ఉత్సవాల కోసం విద్యుత్ దీపాల అలంకరణ, పందిళ్లు, రంగులతో అందంగా ముస్తాబయ్యాయి. పట్టణంలో శ్రీరామ కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించాలని ఉత్సవ కమిటీల ప్రతినిధులు తెలిపారు. అడ్లూర్ సీతారామచంద్రస్వామి, చిన్న మల్లారెడ్డిలోని సీతారామలక్ష్మణ ఆలయం, రామారెడ్డి లోని సీతారామచంద్రస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. బీబీపేట మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం, యాడారం, తుజాల్‌పూర్ గ్రామాల్లోని సీతారామచంద్ర స్వామి ఆలయం, పాత బాన్సువాడ హనుమాన్ మందిరం, పాత రాంమందిరాల్లో ఈ ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి దీవెనలు పొందాలని వారు కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రీరామసేన ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ధర్మశాల వద్ద నుంచి శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా కొనసాగి దేవునిపల్లి వద్ద ముగియనున్నట్లు శ్రీరామసేనప్రతినిధులు తెలిపారు. డప్పువాయిద్యాలతో, కళాకారుల బృందంతో, భక్తిపాటలతో భారీ విగ్రహాలతో చేసే ఈ శోభాయాత్రకు పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.



కామారెడ్డి సీతారామాంజనేయ ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



రైల్వే స్టేషన్ వద్ద గల ఆలయంలో ..

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

ఖిల్లా, ఏప్రిల్ 16: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు 6వ టౌన్ ఎస్సై రమేష్ తెలిపారు. సారంగపూర్ గ్రామానికి చెందిన రాజేశ్వరి (25) బీడీలు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లతో జీవనం సాగించేది. అయితే, పోషణ భారంగా మారడం, పైగా ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో తీవ్ర మనస్థాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 16: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందల్వాయికి చెందిన మైసశ్రీకాంత్ (37) అనే వ్యక్తి గ్రామంలోని పెద్దచెరువు కిందగల అలుగు వద్ద చేపల వేటకు వెళ్లి రెండు కాళ్లకు వల చుట్టుకోవడంతో మృతి చెందినట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. శ్రీకాంత్‌కు మతిస్థిమితం సరిగా లేదని, అతను చేపల కోసం వెళ్లి కాళ్లకు వల చుట్టుకోవడం వల్ల మృతి చెందాడని అన్నారు. మృతుని సోదరుడు మైన శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మోదీ అంటేనే అభివృద్ధి : ఎంపీ అర్వింద్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 16: అవినీతికి దూరంగా, అభివృద్ధే ధ్యేయంగా ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఘన విజయాలను సాధిస్తోందని, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీజేపీని గెలిపించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ముచ్కూర్ చౌరస్తా వద్ద ఉన్న శ్రీ బ్రహ్మలింగేశ్వర టీ పాయింట్ వద్ద చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటుతో రైతుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. మున్ముందు నియోజకవర్గంలో భవిష్యత్ కార్యక్రమాలు ఉండనున్నాయని, బీడీ కార్మికుల కోసం 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. ధర్మం నిలవాలన్న, దేశం గెలవాలన్న బీజేపీయే రావాలని, మోదీయే ప్రధాని కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.



డీసీఎం ఢీకొనడంతో మృతి చెందిన ప్రభాకర్ (ఇన్‌సెట్ మృతుడు ఫైల్)

నిశ్చితార్థం జరిగిన తెల్లారే యువకుడి మృతి


● రోడ్డు దాటుతుండగా బైక్‌ను ఢీకొన్న వ్యాన్

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 16: చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు చూశాడు.. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించాడు.. ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలనుకున్నాడు.. నిశ్చితార్థం సైతం చేసుకున్నాడు.. అయితే, ఆ ఆనంద క్షణాలు కొన్ని గంటలు కూడా మిగలలేదు. తెల్లారే మృత్యువు ఆ యువకుడి ఆశలు ఛిద్రం చేస్తూ విగతజీవిగా మార్చింది. ఈ హృదయ విదారక ఘటన రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తిర్మన్‌పల్లికి చెందిన దిలారి ప్రభాకర్(28) బీఫార్మసీ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. జీవితంలో స్థిరపడ్డాడు. కాగా, వివాహం చేసుకుందామని పెద్దలు చూసిన అమ్మాయిని చూశాడు. ఇందల్‌వాయి మండలం తిర్మన్‌పల్లికి చెందిన యువతిని వివాహం చేసుకునేందుకు అంగీకరించి ఈనెల 15న సోమవారం నిశ్చితార్థం సైతం చేసుకున్నాడు. ఆ ఆనందంలో మిత్రులు రాజు, రవిలతో కలిసి బైక్‌పై సరదాగా బయటకు వెళ్లాడు. తిరిగి గ్రామంలోకి వస్తుండగా గ్రామశివారులో కల్లుబట్టి వద్ద అదేసమయంలో మలుపు వద్ద పొల్ల నుంచి శ్రీనగర్‌కు వడ్ల లోడ్‌తో వేగంగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. దాంతో బైక్ కొద్దిదూరం లాక్కెళ్లింది. ప్రభాకర్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మిగతా ఇద్దరు మిత్రులు మాత్రం స్వల్పగాయాలతో తప్పించుకున్నారు. డీసీఎం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిశ్చితార్థం జరిగి వివాహం జరుగుతుందనుకున్న తరుణంలో కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు హృదయవిదారంగా రోధించారు. తిర్మన్‌పల్లి గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.


ముగిసిన బడాపహాడ్ టెండర్

● ఎన్నికల కోడ్‌తో నిర్వహణ బాధ్యతలపై ఉత్కంఠ

వర్ని,ఏప్రిల్16: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన బడా పహాడ్(పెద్దగుట్ట)పుణ్యక్షేత్రం టెండర్ ఈ నెల 14తో ముగిసింది. 2021- 22ఏడాదికి గాను రూ.3.20కోట్లకు టెండర్ కాగా 2023-24ఏడాదికి రూ.3.50కోట్లకు టెండర్‌ను కొందరు సిండికేట్‌గా ఏర్పడి దక్కించుకున్నారు. దీంతో మళ్లీ టెండర్‌ను దక్కించునేందుకు గతంలో టెండర్ పొందిన వ్యక్తులు మళ్లీ రూ.4కోట్లకు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వాసనీయంగా తెలిసింది. టెండర్ ద్వారా యేట భక్తులు నిలువుదోపిడికి గురి కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కొత్త వేసేందుకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు కొత్త టెండర్ వేయడంలో కోడ్‌ను పరిగణలోకి తీసుకుని నిర్వహణ బాధ్యతలను జిల్లా వక్ఫ్‌బోర్డు సిబ్బందికి అప్పజెప్పే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర సీఈవో ఖాజా మొయినోద్దీన్‌లు బడాపహాడ్ నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్‌ల నుంచి స్వాధీనపర్చుకునేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. టెండర్ కాల వ్యవధి ముగిసినందున సంబంధిత అధికారులు ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు భక్తులకు మౌలిక సదుపాయల కల్పన, నిర్వహణ బాధ్యతలను స్థానిక వక్ఫ్‌బోర్డు సిబ్బందికి అప్పజెప్పి కాంట్రాక్టర్‌ల నిలువు దోపిడిని నియంత్రించి పారదర్శకంగా దర్శన భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం


ముస్తాబైన ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం



శక్కర్‌నగర్ రామాలయ ముఖ ద్వారం


డొంకేశ్వర్ రామాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

డిచ్‌పల్లి: నేడు చారిత్రాత్మక రామాలయంలో రామనవమి పురష్కరించుకొని ఆలయ నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆల య ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా దంపతులు నేడు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన అనంతరం సీతరామ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ , ధర్మకర్తలు భక్తులకు త్రాగు నీరు, అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నారు.

● మాధవనగర్ సాయిబాబా ఆలయంలో బాబా జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

క్రోధి నామ సంవత్సరం పురష్కరించుకొని నేడు బర్దిపూర్ శివారులో గల సాయిబాబా మందిరంలో బాబా జన్మదిన వేడుకలను వైభోపేతంగా నిర్వ హిస్తున్నమని ఆలయ సహాయ కమిషనర్ సుప్రియ, ఈవో రవీందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 5గంటలకు బాబా కగడ హారతి, మహా గణపతి పూజ,బాబా అభిషేకం, 7గంటలకు ప్రత్యేక హారతి, బాబా నామస్మరణం,జన్మదినవేడుకలు, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణం, అనంతరం సాయిబాబా పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని, భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయలగలరని ఆయన కోరారు.

మోపాల్: శ్రీరామనవమి సందర్భంగా మాధవనగర్ సాయిబాబా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదేరోజు సాయిబాబా జన్మదినం కావడంతో ఏవో రవీందర్‌గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రతీసంవత్సరం సాయిబాబా ఆలయంలో ఉదయం సాయిబాబా జన్మదిన వేడుకలు, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణోత్సవం భక్తుల సమక్షంలో పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బోధన్‌రూరల్: బోధన్ శక్కర్‌నగర్‌లోని రామాలయం భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందినది. ఈ రామాలయానికి ఎంతో విశిష్ఠత ఉండటంతో ప్రతియేటా శ్రీరామ నవమి రోజు వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు. ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉండటంతో ఈ ఆలయం శ్రీరామ నవమి వేడుకలకు ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుంది. శక్కర్‌నగర్ రామాలయంలో శ్రీ సీతారాముల సతీసమేతంతో పాటు హనుమంతుని వెలిసిన విగ్రహాలు దర్శనమిస్తాయి. 1951లో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఆలయంలోని సీతారాముల, లక్ష్మణ, అంజనేయ స్వామి విగ్రహాలు పాలరాతితో నిర్మించబడి ఉంటాయి. ఆలయంలోని శ్రీరామ చంద్రుల విగ్రహాలు పశ్చిమాభిముఖం ఉండటంతో రెండవ భద్రాద్రిగా శక్కర్‌నగర్ రామాలయాన్ని పిలుచుకుంటారు. ఆలయానికి సుమారు పదహారు లక్షలతో రాజగోపురం నిర్మాణం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం గదులను నిర్మించారు. ప్రతియేటా శ్రీరామ నవమి రోజు ప్రత్యేక పూజలు, శ్రీరాముని పట్టాభిషేకం, విగ్రహాల ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగుతుంది.

● నేడు శ్రీరామ నవమి వేడుకలు

శక్కర్‌నగర్ రామాలయంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సీతారాముల కళ్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, రాత్రి 7 గంటల నుంచి 12 గంటల వరకు రథోత్సవ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గురువారం ఉదయం 9 గంటలకు శ్రీరాముని పట్టాభిషేకం, అన్నదాన కార్యక్రమం కొనసాగనుంది. శ్రీరామ నవమి వేడుకలకు ఆలయ కమిటీ పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసింది.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆలయాన్ని సర్వంగా సుందరంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. మంగళవారం డొంకేశ్వర్ రామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించి సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు విగ్రహాలకు వేదపండితులు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకీపై ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ కళ్లెం గంగారెడ్డి, నాయకుడు మధు, గొల్ల మహేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మురళీగౌడ్, అంజి, ఎంపీటీసీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెంజర్ల గ్రామంలోని ఆలయంలో హోమం, హన్మాన్ వాహనసేవ, గరుడ వాహనసేవ, ప్రత్యేక పూజ నిర్వహించారు. బుధవారం శ్రీరామ నవమి, 10.30అభిజిత్ లగ్న ముహూర్తంలో సీతారామ చంద్రస్వామి కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్ర రథోత్సవం నిర్వహించే స్వామివారికి కళ్యాణానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని రంగులతో వివిధ రంగుల పువ్వులతో విద్యుత్ దీపాలతో, చాలువ పందిరి అలంకరించారు. ఉత్సవమూర్తులకు గోదావరి స్నానం చేయించి 9గంటలకు ఆలయంలో మహా అన్నదానం నిర్వహించనున్నారు.

● సిద్దులగుట్టపై శ్రీరామ నవమికి ఏర్పాట్లు

పెర్కిట్: శ్రీరామ నవమి సందర్భంగా ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సీతరాముల కళ్యాణం పురస్కరించుకొని గుట్టపై రామాలయం ఎదుట పచ్చటి మామిడి తోరణాలతో కళ్యాణ పందిరి వేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం వేదపండితులు వేదంతం గోపికృష్ణశర్మ, ఆల య ప్రధానఅర్చకుడు కుమార్‌శర్మ పంతులు కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సంవత్సరం సీతరాముల కళ్యాణం భద్రచలంలో ఏ విధంగా నిర్వహిస్తారో అదే విధంగా సిద్దులగుట్టపై అంగరంగా వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు అన్నప్రసాద వితరణ సాయంత్రం వరకు కొనసాగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతరాముల కళ్యాణం వీక్షించాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం గుట్ట కింది నుంచి ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, బోండ్ల ఆనంద్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, కొంతం మురళీ, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: సాయిబాబా జన్మదిన వేడుకలకు నగర శివారులోని మాధవ నగర్ సాయిబాబా ఆలయం ముస్తాబైంది. బుధవారం సాయిబాబా జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9గంటలకు సాయిబాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవీందర్‌గుప్త తెలిపారు.మధ్యాహనం 12 గంటలకు శ్రీరామనవమి కల్యాణోత్సవాన్ని ఆలయప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ముప్కాల్‌లో ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం


సిద్దులగుట్టపై కల్యాణ పందిరిని ఏర్పాటు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

● తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం జాతర ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకుంటున్నారు. మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఎమ్మెల్యే దంపతులు, భక్తులు తిలకరించారు. బుధవారం రథోత్సవం జరగనుంది. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: శ్రీసీతారామచంద్రమూర్తి కళ్యాణమహోత్సవానికి రూరల్ మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీసీతారాముల కళ్యాణానికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను రంగురంగు లైట్లతో ముస్తాబుచేశారు. గుండారంలోని శ్రీకోదండరామాలయం, శ్రీనగర్‌లోని రామాలయం, తిర్మన్‌పల్లిలోని సీతారామాలయం, సారంగపూర్‌లోని శ్రీకోదండరామాలయంలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద తాటాకు పందిళ్లు వేశారు. మంచినీరు, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.





స్ట్రాంగ్ రూంల కోసం ఎంపీడీవో కార్యాలయం పరిశీలన


డిచ్‌పల్లిలో ఈవీఎంల భద్రపరిచేందుకు గదులను పరిశీలిస్తున్న ఆర్డీవో

డిచ్‌పల్లి,ఏప్రిల్ 16: వచ్చే నెలలో పార్లమెంట్ ఎలక్షన్స్ జరగనున్న నేపథ్యంలో కౌటింగ్ పూర్తి అనంతరం ఈవీయం లను స్ట్రాంగ్ రూంలను భద్రపరిచేందుకు డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని తహసీల్దార్ ప్రభాకర్ తో కలిసి ఆర్డీవో రాజేందర్ కుమార్ మంగళవారం పరిశీలించారు. గదులను శుభ్రం చేస్తు ఉంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

●తహసీల్దార్ కార్యాలయం సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) కిరణ్మాయి సందర్శించారు. కార్యాలయంలో జరుగుతున్న ధరణి పోర్టల్, సర్టిఫికెట్‌ల విధివిధనాలను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ ప్రభాకర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

నవీపేట,ఏప్రిల్16: మండలంలోని ఫకీరాబాద్, మిట్టాపూర్‌ల మధ్యన సోమవారం రాత్రి రైలు కింద పడి సుమారు 55సంవత్సరాల వయసు గల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని నిజామాబాద్ రైల్వే ఎస్‌ఐ సాయిరెడ్డి తెలిపారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ షర్టు, వంకాయ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నిజామాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

నవీపేట,ఏప్రిల్16: మండల కేంద్రానికి చెందిన ర్యాగళ్ల లావణ్య అలియాస్ లక్ష్మి నర్సమ్మ(42)అనే ఉపాధి కూలీ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. సోమవారం స్థానిక లింగమయ్య గుట్ట చెరువు పూడికతీత పనులలో పాల్గొన్న లావణ్యకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతురాలికి భర్త రాజశేఖర్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

మోపాల్, ఏప్రిల్ 16:మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామానికి చెందిన మహిళ రైతు అరికెల లక్ష్మి రోడ్డుపై వడ్లను ఆరబోస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం ఆమెను మాటలో దింపి మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని బాధితురాలు మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మి వరిధాన్యాన్ని రోడ్డుపై పోసి ఆరబోస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమెను మాటలోదింపి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష

ఖిల్లా, ఏప్రిల్ 16: పేకాట, అసభ్యంగా, మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురు వ్యక్తులకు రెండు రోజుల పాటు కోర్టు జైలు శిక్ష విధించినట్లు మూడో టౌన్ ఎస్సై ఎల్.ప్రవీణ్ తెలిపారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో పేకాట ఆడుతున్న ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకొని మంగళవారం కోర్టు ఎదుట హాజరుపర్చగా వారిద్దరికి న్యాయాధికారి సయ్యద్ ఖదీర్ రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తిని, అసభ్యంగా ప్రవర్తించిన మరో ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా వారికి సైతం రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించారు. ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నామని మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై తెలిపారు.

'వంటగ్యాస్ వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలి'


మహిళలకు గ్యాస్ సిలండర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఖిల్లా, ఏప్రిల్ 16: గృహోపయోగమైన వంటగ్యాస్ సిలండర్‌ను వినియోగించే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగ్‌రావ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల పలు అపార్ట్‌మెంట్లలో మహిళలకు వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను వారికి అందించి అందులో గల నియమనిబంధనలను పాటించాలని సూచించారు. సిలిండర్ వినియోగంపై ప్రయోగం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.మధు, ప్రశాంత్, ప్రశాంత్‌గౌడ్,బి.సురేష్, వినోద్,ఎస్. సురేష్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బోధన్ అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్‌లలో ప్రజలకు, మహిళలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మెగాటవర్స్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అగ్నిమాపక వారోత్స వాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అగ్నిప్రమాదాలపై అగ్ని మాపక సిబ్బంది పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అనంతరం అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మధుసూధన్‌రెడ్డి, మెగాటవర్స్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు జెస్సు అనిల్, తదితరులు పాల్గొన్నారు

సిరికొండలో రేణుక ఎల్లమ్మకు బోనాలు

సిరికొండ ఏప్రిల్ 16: రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా సిరికొండలో మంగళవారం గౌడ సంఘ సభ్యులు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లీకి సమర్పించారు.గ్రామానికి చెందిన గౌడ కుల సంఘ మహిళలు ఇంటికో బోనం ఎత్తుకుని మంగళ హారతులతో ఎల్లమ్మదేవీ ఆలయం వరకు దప్పుల చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్లారు. రేణుక ఎల్లమ్మదేవికి నైవేద్యాలను సమర్పించారు. కుటుంబ సభ్యులతో ఎల్లమ్మదేవిని దర్శించుకుని మొక్కులు ముట్టజెప్పుకున్నారు.కార్యక్రమంలో సంఘంగౌడ సంఘం అధ్యక్షుడు హన్మాగౌడ్,కోశాధికారి, రాజేందర్‌గౌడ్,సభ్యులు రాజాగణేష్‌గౌడ్,లక్ష్మీనారాయణగౌడ్,రాజేదందర్‌గౌడ్,రామస్వామి గౌడ్, రాజగౌడ్‌పెంటాగౌడ్,రాజబహాద్దుర్‌గౌడ్,నాగభూషన్‌గౌడ్,రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగులో యువకుడి అదృశ్యం

ధర్పల్లి ఏప్రిల్16: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన బండ్ల సందీప్ అదృశ్యమైనట్టు ఎస్సై విక్రం మంగళవారం తెలిపారు. రామడుగు గ్రామానికి చెందిన సందీప్ 11నెలల క్రితం గుంజలి గ్రామానికి ఇల్లారం వెళ్ళినట్టు ఆయన తెలిపారు. రామడుగు గ్రామానికి వచ్చిన సందీప్ ఈనెల 9న ఉదయం అత్తగారిం టికి వెళ్తున్ననని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లినట్టు తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్ళ వెతికిన సమాచారం లభించకపోవడంతో సందీప్ తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సవిత

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు జరగొద్దు

రామారెడ్డి, ఏప్రిల్ 16: ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న ఉపాధి పనుల్లో అక్రమాలు జరగవద్దని విధులు సక్రమంగా నిర్వహించాలని రామారెడ్డి ఇన్‌చార్జ్ ఎంపీడీవో సవిత పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో మంగళవారం ఈజీఎస్ నుంచి ఉపాధి కూలీలు తీస్తున్న ఫిష్‌పాండ్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిధులకు తగ్గట్టు పనులను సక్రమంగా నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ధర్మారెడ్డి, కార్యదర్శి సాగర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమకు తగిన కూలి చెల్లించాలి

పిట్లం: ఉపాధి హామీ కూలీలకు ప్రతి రోజూ పనులు కల్పించి శ్రమకు తగ్గ వేతనాలు చెల్లించాలని డీఆర్డీవో పీడీ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధిహామీ పనులపై డీఆర్డీవో చందర్‌నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు శ్రమకు తగ్గ ఫలితం దక్కేలా పనులు కేటాయించాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రతలు మరియు అక్కడ తాగునీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. వేసవి కాలంలో కూలీలకు పనుల వద్ద ఎలాంటి సవస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్ పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై విద్యార్థులకు అవగాహన

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 16: కామారెడ్డిలోని బతుకమ్మ కుంట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు సాయి ఈశ్వరి విద్యార్థులకు అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థులు వారి ఇండ్లలో వాడుతున్న ఉప్పును పరీక్షించి అందులో అయోడిన్ స్థాయి ఎంత మేర ఉందనేది వివరించారు. అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధులను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ పర్యవేక్షకుడు వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్తలు రేణుక, ఆశా కార్యకర్త పద్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు కుస్తీ పోటీలు

గాంధారి, ఏప్రిల్ 16: మండల కేంద్రంలో గురువారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ పేర్కొంది. శ్రీరామనవమి పురస్కరించుకుని కుస్తీలను ప్రతీ సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో నిర్వహించనున్నట్లు పున్న రాజయ్య తెలిపారు. కుస్తీలకు మండలం, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మలయోధులు తరలిరావాలని తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో 1392.22 అడుగుల నీరు

నిజాంసాగర్, ఏప్రిల్ 16: నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను 1392.22 అడుగుల నీరు నిల్వ ఉంది. 17.802 టీఎంసీలకు గాను 5.098 టీఎంసీల నీరు ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్నట్లు నీటి పారుదల శాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు నిలకడగా ఉందని వివరించారు.

సివిల్స్‌లో కామారెడ్డి వాసికి 574వ ర్యాంకు



రజనీకాంత్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 16: కామారెడ్డి పట్టణంలోని కల్కినగర్‌కు చెందిన సిద్ధిరాములు-పద్మల కుమారుడైన రామారెడ్డిపేట రజినీకాంత్ జాతీయ స్థాయిలో వెలువడిన సివిల్స్ పరీక్ష ఫలితాల్లో 574 ర్యాంకు సాధించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు చందు తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి కామారెడ్డిలోనే వివిధ పాఠశాలల్లో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఏపీఆర్‌జేఎస్ మాచర్ల గుంటూర్‌లో, బీఏ హిస్టరీ కోర్సును వెంకటేశ్వర కాలేజ్ ఢిల్లీ యూనివర్సిటీలో పూర్తి చేసుకున్నట్లు వివరించారు. గత 5 సార్లు సివిల్స్ రాసినా ప్రయోజనం లేకపోవడంతో పట్టు వదలకుండా ఆరోసారి పరీక్ష రాసి 587ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ సామాన్య కుటుంబమైన మా అబ్బాయి సివిల్స్ సాధించడం సంతోషకరమని తెలిపారు.



పాదయాత్రగా శబరిమాత ఆలయానికి వచ్చిన భక్తులు

పాదయాత్రగా శబరిమాత ఆశ్రమానికి వచ్చిన భక్తులు

తాడ్వాయి, ఏప్రిల్ 16: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి పాదయాత్రతో శబరిమాత భక్తులు తాడ్వాయి శబరిమాత ఆశ్రమానికి మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ తాము ప్రతీ సంవత్సరం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి పాదయాత్రగా తరలివస్తామని తెలిపారు. పాదయాత్రతో అమ్మ ఆశ్రమానికి చేరుకోవడంతో తమకు అన్ని రకాల దీవెనలు అందుతాయని తెలిపారు. 300 మంది భక్తులు పాదయాత్రతో ఆశ్రమానికి చేరుకున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ప్రత్యేకాధికారి విజయ్ భాస్కర్

నిజాంసాగర్, ఏప్రిల్ 16: వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి విజయ్ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో లీకేజీలున్నట్లయితే వాటిని అరికట్టడంతో పాటు వృథా నీరు వెళ్లకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో సింగిల్ ఫేజ్ మోటార్లను అవసరాల మేరకే ఉపయోగించుకోవాలని, సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా నీరంతా వృథా అవుతుందన్నారు. మురికి కాల్వలను శుభ్రం చేయడంతో పాటు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా రెండు పూటలు సక్రమంగా అందిస్తూ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల్లోని వార్డులను సందర్శించి, కుళాయిలతో పాటు సింగిల్ ఫేజ్ మోటార్లను పరిశీలించాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో యాదగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.



అచ్చంపేటలో నీటి వినియోగదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

గ్రామాల్లో సందర్శించిన ప్రత్యేకాధికారులు

అచ్చంపేట, మల్లూర్ గ్రామాల్లో మంగళవారం మండల ప్రత్యేకాధికారితో పాటు ఎంపీడీవో యాదగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి సుమలత సందర్శించారు. నీటి వినియోగదారులతో నీటి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సింగిల్ ఫేజ్ మోటార్లను అవసరం నిమిత్తం వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు.

బీర్కూర్: వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో పర్యటించారు. తాగునీటి సరఫరా గురించి ఆరా తీశారు. గ్రామస్తులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం నేపథ్యంలో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పిట్లం: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని మండల కార్యదర్శులకు డీపీవో శ్రీనివాస్‌రావు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్యలపై సమీక్ష సమావేశం డీపీవో నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీవో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్యలు ఉంటే ముందస్తుగా గుర్తించి సమస్యలు తలెత్తకుండా తాత్కాలిక పనులు చేసి నీటి సమస్య తీర్చాలని సిబ్బందికి సూచించారు. వేసవి కాలంలో బోరు బావుల్లో నీరు తగ్గితే గ్రామంలో నీరు ఉన్న వాటిని అద్దెకు తీసుకొని నీటి సమస్య తీర్చాలన్నారు. వేసవి కాలంలో వడ దెబ్బలు తగలకుండా జాగ్రతలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో బ్రహ్మం పాల్గొన్నారు.



రైతునగర్‌లో పైప్‌లైన్‌లను పరిశీలిస్తూ..

శ్రీరాముడు అందరివాడు.. బీజేపీ సొంతం కాదు

● జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్

భిక్కనూరు, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల వేళ బీజేపీ మతతత్వ రాజకీయాలు చేస్తుందని శ్రీరాముడు కేవలం బీజేపీ సొంతం కాదని, యుగ పురుషుడు శ్రీరాముడు అందరివాడని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ అన్నారు. మంగళవారం భిక్కనూరులో మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసిన బీఆర్ఎస్‌కు, దేశంలోని అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతున్న బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తిప్పికొట్టాలన్నారు. గత తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో పార్లమెంట్‌లో తెలంగాణ కోసం కొట్లాడిన వ్యక్తిగా తనను జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే మీలో ఒక్క కుటుంబ సభ్యుడిగా ఉండి ఈ ప్రాంతం అభివృద్ధికి పాటుపడుతానని, ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని కోరారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో జహీరాబాద్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానన్నారు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న బీబీ పాటిల్ బీఆర్ఎస్‌లో గెలిచి తన వ్యాపారాల కోసం బీజేపీలో చేరి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నాడని, బీబీ పాటిల్ కేవలం తన వ్యాపారాల అభివృద్ధికే రాజకీయాల్లో కొనసాగుతున్నాడని ఆరోపించారు. ఈ పది సంవత్సర కాలంలో ఈ ప్రాంతానికి అతడు ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. అతడు బీబీ పాటిల్ కాదని బిజినెస్ పాటిల్ అని అన్నారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్ గాలిలోనే తిరుగుతున్నాడని అన్నారు.

కేసీఆర్ త్వరలోనే జైలుకు పోవటం ఖాయం

: ప్రభుత్వ సలహాదారుడు, షబ్బీర్‌అలీ

రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో చేసిన అవినీతికి త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని, సీఎం రేవంత్ కేసీఆర్‌కు జైలులో డబుల్‌బెడ్‌రూం సిద్ధం చేస్తున్నాడని అన్నారు. భిక్కనూరు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్‌కు 10వేల కోట్ల అదాయంతో అప్పగిస్తే కేసీఆర్, అతడి కుటుంబం 10 సంవత్సరాలలో లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు. మద్యం కుంభకోణంలో కవిత తీహార్ జైలులో ఉందని, అధికారం పోగానే కేసీఆర్ కాలు విరిగిందని ఎద్దేవా చేశారు. ఈ పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అన్ని కుట్రలు, కుతంత్రాలే చేశారని, ప్రతిపక్ష నాయకులతో పాటుగా హరీష్‌రావు, అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లను సైతం టాపింగ్ చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షకోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. చేసిన పాపానికి శిక్ష తప్పదని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో ప్రధాని మోదీ చేసిందేమి లేదని ఆరోపించారు. దేశంలో హిందు, ముస్లింల మధ్యలో గొడవలు పెట్టడం తప్ప చేసిందేమి లేదన్నారు. యువత ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 1000 మంది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్ధరాములు, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజారెడ్డి, నాయకులు సుదర్శన్, రేఖ, దయాకర్‌రెడ్డి, అంకం రాజు, నర్సింహారెడ్డి, కుంట లింగారెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



బీర్కూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

'దేశం, ధర్మం కోసం బీజేపీని గెలిపించండి'

బీర్కూర్, ఏప్రిల్ 16: దేశం కోసం.. ధర్మం కోసం.. బీజేపీకి ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ నాయకులు బీర్కూర్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్: మండలంలోని తడిహిప్పర్గ గ్రామంలో బీజేపీ కార్యకర్తలు జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. మద్నూర్ అధ్యక్షులు తుకారాం ఆధ్వర్యంలో బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన డీఎల్‌పీవో



చించోల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

బీర్కూర్, ఏప్రిల్ 16: మండలం చించోల్లి గ్రామంలో మంగళవారం డీఎల్‌పీవో నాగరాజు పర్యటించారు. మొదట గ్రామ పంచాయతీకి చేరుకుని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ, కంపోస్టు షెడ్, పల్లె ప్రకృతి వనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీవో అనిత, జీపీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నసురుల్లాబాద్, ఏప్రిల్ 16: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం నిజామాబాద్‌లోని 'జోసలుకాస్' మంగళవారం సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల విలువ గల సామగ్రిని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జోసలుకాస్ పాఠశాల వసతుల కోసం ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోసలుకాస్ మేనేజర్ స్మితేష్, నరేందర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చందర్, బొమ్మన్‌దేవ్‌పల్లి పీఎస్ హెచ్‌ఎం రాజు, పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హన్మాండ్లు, జి.భూషణ్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఘనంగా అష్టమి పూజలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో పక్కన బీడీ కాలనీలో ఉన్న భగలాముఖి పీఠంలో మంగళవారం అష్టమి పూజను నిర్వాహకులు జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ పండ్ల రసాలతో ప్రత్యేకంగా అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రత్యేకాధికారికి సన్మానం

మద్నూర్, ఏప్రిల్ 16: మద్నూర్ ప్రత్యేకాధికారిణిగా నియమితులైన మద్నూర్ ఎంపీడీవో సవితకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, కార్యకర్తలు సన్మానించారు. గతంలో మద్నూర్ ప్రత్యేకాధికారి, పశువైద్యుడు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో నూతన ప్రత్యేక అధికారిణిగా నియమించారు. ఈ సందర్భంగా పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో సందీప్, నాయకులు రాములు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం ఉదయం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్యులు హరికిషన్‌రావు ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కంటి పరీక్ష శిబిరంలో 377 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు హరికిషన్‌రావు తెలిపారు. అందులో 24 పిల్లలకు దృష్టి లోపం ఇద్దరికి మెల్ల కన్ను ఉన్నట్లు గుర్తించి వారికి మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్‌లోని సరోజిని దేవి కంటి ఆసుపత్రికి పంపిస్తామని తెలిపారు. 14 మంది విద్యార్థులకు చిన్న చిన్న కంటి లోపాలు ఉన్న వారికి అవసరమైన మందులు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సంజయ్‌కుమార్, సంగీత, కళాశాల ప్రిన్సిపాల్ కృతామూర్తి, పర్మసిస్ట్ రవితేజ, సిరాజ్, ఆరోగ్య కార్యకర్త ఇందిర, సునీత, ఆశా కార్యకర్తలు సంధ్యాదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● ఆర్డీవో మన్నే ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మన్నే ప్రభాకర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ఓటు హక్కు ఆయుధం లాంటిదని ప్రజాస్వామ్యంలో మార్పు రావాలన్న ఓటు హక్కుతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంఈవో వెంకటేశం, కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అవినీతి రహిత పాలన అందించాలి

● ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

భిక్కనూరు, ఏప్రిల్ 16: కామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతి రహిత పాలన అందించాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సూచించారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అనంతరం గడ్డం ఇందుప్రియ మొదటిసారి భిక్కనూరుకు వచ్చిన సందర్భంగా భిక్కనూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు మాట్లాడుతూ.. కామారెడ్డిలో ఇళ్లు కట్టుకునే వారి వద్ద ఒక్క రుపాయి కూడా తీసుకోవద్దని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కృషితోనే కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు తెలిపారు. వారి సహకారంతో కామారెడ్డి అభివృద్ధికి తన పూర్తి సమయాన్ని కేటాయిస్తానని అన్నారు. జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్య క్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపాల్ చైర్మన్‌ను కలసిన దోమకొండ నాయకులు

దోమకొండ, ఏప్రిల్ 16: కామారెడ్డి మున్సిపాల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన గడ్డం ఇందుప్రియ, చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం అమె నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, అంబార్‌పేట ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్,పట్టణాధ్యక్షుడు, మధు, పిన్నం నాగేందర్ పాల్గొన్నారు.

దేమికలాన్‌లో యువకుడి ఆత్మహత్య

తాడ్వాయి, ఏప్రిల్ 16: మండలంలోని దేమికలాన్ గ్రామంలో కన్కల్ గ్రామానికి చెందిన కౌడి శ్రీకాంత్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ సంజీవ్ తెలిపారు. శ్రీకాంత్ చిన్నతనం నుంచి దేమికలాన్‌లో మేనత్త దగ్గర ఉంటూ ఇంటర్ వరకు చదువుతున్నాడని తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని సోమవారం ఉదయం నుంచి ఇంటికి రాకపోవడంతో మేనత్త మందలించింది. దీంతో మనస్థాపం చెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ విషయమై కౌడి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడు శ్రీకాంత్‌కు ఇంకా వివాహం కాలేదని వివరించారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

మద్నూర్, ఏప్రిల్ 16: మద్నూర్ మండల కేంద్రంలో మంగళవారం అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మద్నూర్ అగ్నిమాపక అధికారి వినోద్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 14 నుంచి వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు జరుపుకుంటున్నామని, అగ్ని ప్రమాదాలు జరుగకుండా, జరిగితే వాటి నివారణకు సలహాలు, సూచనలు అందజేస్తున్నామని వెల్లడించారు.



మద్నూర్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- లవ్‌గురు
శాంతి	- టిల్ స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- లవ్‌గురు



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

